సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

మంగళవారం, 19, ఆగస్టు, 2025



సెంట్రల్ జైలులో అవినీతి 'కిరణాలు'!

సత్‌ప్రవర్తన నేర్పించాల్సిన సిబ్బందే ఖైదీలకు తప్పుడు నడతను అలవాటు చేస్తున్నారు. ఎంజాయ్ చేసేందుకు కావాల్సిన సదుపాయాలు సమకూరుస్తున్నారు. - 8లో



హామీల అమలులో 'సూపర్ ఫెయిల్యూర్'

సూపర్ సిక్స్ హామీలు సూపర్ సక్సెస్‌గా అమలు చేశామని ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్ రెడ్డి విమర్శించారు. - 8లో

గరిష్టం/కనిష్టం
30.0 /24.6

వాతావరణం

జిల్లాలో సోమవారం 24.6 - 30.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

అంతర్జాతీయ సదస్సుకు వైవీయూ ఆచార్యుడికి ఆహ్వానం



వైవీయూ ఆచార్యులు జయరాజు

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయంలోని భూ విజ్ఞానశాస్త్ర విభాగంలో ఆచార్యుడిగా పనిచేస్తున్న ఎస్. జయరాజుకు యూకే లోని స్కాట్లాండ్ సెయింట్ ఆండ్రూస్ యూనివర్శిటీ నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు ఆహ్వానం అందింది. ఈ నెల 19 నుంచి 22 తేదీ వరకు జరిగే సదస్సులో ఆయన పాల్గొననున్నారు. 'భారతదేశ తూర్పు తీరంలోని కొన్ని ప్రాంతాల నుంచి సముద్ర కాలుష్యాన్ని విశ్లేషించడానికి మలస్కన్ షెల్స్ వినియోగం' అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించనున్నారు. ఈయనకు అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం అందడంపై వైవీయూ వైస్ చాన్సలర్ అల్లం శ్రీనివాస రావు తదితరులు అభినందనలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాలలో ఎమ్మెస్సీ ఎర్త్ సైన్స్ విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ అప్లైడ్ జియాలజీ కోర్సులో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు సంచాలకులు టి.లక్ష్మి ప్రసాద్ తెలిపారు. ఈ కోర్సుల్లో పట్టభద్రులైన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కోర్సులో ప్రవేశానికి ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తిగల విద్యార్థులు రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు 89855 97928, 99854 42196 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

వీఆర్‌ఏలతో భర్తీ చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : తహసిల్దార్ కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్మెన్, రికార్డ్ అసిస్టెంట్, పోస్టులను అర్హులైన వీఆర్‌ఏలతో భర్తీ చేయాలని ఏపీ వీఆర్‌ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం నగరంలోని వీఆర్‌ఏ అసోసియేషన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. చాలా ఏళ్ల నుంచి తహసీల్దార్ కార్యాలయాల్లో పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల వీఆర్‌ఏలతో అనధికారికంగా డ్యూటీలు చేయిస్తున్నారని తెలిపారు.ఈ విషయం ఇది వరకే జిల్లా అధికారులకు విన్నవించామని తెలిపారు. పోస్టులను భర్తీ చేయకపోవడంతో డ్యూటీ చేస్తున్న వీఆర్‌ఏలపై ఆర్థిక భారం పడుతోందన్నారు ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య పాల్గొన్నారు.

డీ ఫార్మసీ ప్రవేశాలకు నేటితో గడువు పూర్తి

– ప్రిన్సిపల్ సీహెచ్ జ్యోతి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్‌లలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి డి ఫార్మసీ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు 19వ తేదీతో గడువు ముగుస్తుందని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సీహెచ్ జ్యోతి తెలిపారు. ఈ ఫార్మసీ కోర్సు పూర్తి చేసిన వారికి వంద శాతం ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఉంటాయని చెప్పారు. కోర్సులో ప్రవేశం పొంది రేషన్ కార్డు, ఇన్‌కమ్ సర్టిఫికెట్ కలిగి ఉన్న పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందుతాయని తెలిపారు. ప్రవేశాలకు సంబంధించి మరిన్ని వివరాల కోసం 94401 44057, 98853 55377 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

వదలని వాన

- అన్నదాతల్లో అలజడి
- దెబ్బతింటున్న మొక్కజొన్న, ఉల్లి, మినుము పంటలు
- జిల్లాలో 65 హెక్టార్లలో మొక్కజొన్న, మినుము పంటలకు నష్టం
- మైదుకూరులో మోటారు వేస్తుండగా షార్ట్ సర్క్యూట్‌తో రైతు మృతి



విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన రైతు పవన్‌కుమార్



మైదుకూరులో వర్షాలకు కూలిన మట్టిమిద్దె

కడప అగ్రికల్చర్ : అల్పపీడనం కారణంగా జిల్లావ్యాప్తంగా పది రోజుల నుంచి వర్షాలు కొనసాగుతున్నాయి. ఈ వర్షాలతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు, రైతులు విసిగివేసారి పోతున్నారు. నిన్నామొన్నటి వరకు వర్షాల కోసం ఎదురుచూసిన అన్నదాతలు నేడు ఈ వర్షాలు వద్దుబాబోయ్ అనే పరిస్థితికి చేరుకున్నారు. వరుసగా పడుతున్న వర్షాలతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పూర్తిగా పారిశుద్ధ్యం లోపించింది. దీంతో దోమల బెడద అధికమై జనాలు జ్వరాల బారిన పడుతున్నారు. ఇక అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నిత్యం కురుస్తున్న వర్షాలకు భూమి తడారక ఆరుతడి పంటలు ఎర్రగా మారి దెబ్బతింటున్నాయని రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. పంటల్లో కనీసం కలుపు మొక్కలను తీద్దామన్నా కష్టతరంగా మారిందని వాపోతున్నారు.

జిల్లాలో 65 హెక్టార్లలో పంటలకు నష్టం...

జిల్లావ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు, వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లుతోంది. ఇందులో భాగంగా పెద్దముడియం మండలంలో 25 హెక్టార్లలో, మొక్కజొన్న, 20 హెక్టార్లలో కమలాపురం మండలంలో 20 హెక్టార్లలో మినుమపంటలకు నష్టం వాటిటినట్లుగా వ్యవసాయశాఖ గుర్తించింది. ఇలా వర్షం ఇలాగే కొనసాగితే ఇంకా మొక్కజొన్నతోపాటు మినుము, ఉల్లి, పత్తి, పూల పంటలకు కూడా నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

విద్యుత్ శాఖ హెచ్చరిక...

మైదుకూరు పోరుమామిళ్ల రోడ్డులో సోమవారం ఎర్రచెరువు దగ్గర పొలం పనుల నిమిత్తం మోటారు వేస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి పవన్ కుమార్(38) అనే రైతు మృతి చెందాడు. ఈ నేపథ్యంలో వర్షాలకు సంబంధించి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి విద్యుత్తుశాఖ హెచ్చరికలతో పాటు పలు సూచనలు జారీ చేసింది. వర్షపు వేళ విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఎలక్ట్రిక్ తీగలు, ఇతర పరికరాల దగ్గర గుమికూడదని తెలిసింది. ఎక్కడైనా విద్యుత్ తీగలు తెగి పడివుంటే 1912 నంబర్‌కి సమాచారం ఇవ్వాలని సూచించారు.

పాత ఇళ్లు, మట్టి మిద్దెలతో అప్రమత్తం

మైదుకూరు: జడివానతో జిల్లాలో పలు ప్రాంతాల్లో మట్టి మిద్దెలు కూలుతున్నాయి. మట్టి, పాత మిద్దెలు ఉన్న వారు వర్షాలతో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఇటీవల జమ్మలమడుగు ప్రాంతంలో ఇళ్లు కూలాయి. తాజాగా మైదుకూరులో ఓబులమ్మ అనే ఒంటరి మహిళ మట్టి మిద్దె కూలిపోయింది.

జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో వర్షం...

అల్పపీడనం కారణంగా సోమవారం తెల్లవారుజామున నుంచి జిల్లావ్యాప్తంగా వర్షాలు కురిసాయి. ఇందులో భాగంగా దువ్వూరులో అత్యధికంగా 25.2 మి.మీ వర్షం కురిసింది.

మండలం నమోదైన వర్షపాతం
(మిల్లీ మీటర్లలో)

దువ్వూరు	25.2	వేముల	10.0
పెద్దముడియం	25.2	అట్లూరు	9.8
ఖాజీపేట	24.8	సింహాద్రిపురం	9.6
కలసపాడు	24.0	బి.కోడూరు	9.6
కాశినాయన	20.6	పెండ్లిమర్రి	9.6
రాజుపాలెం	20.2	సిద్దవటం	9.4
చాపాడు	18.2	బద్వేల్	9.2
మైదుకూరు	18.0	కడప	9.2
బి.మఠం	16.8	కొండాపురం	8.6
పోరుమామిళ్ల	16.2	మైలవరం	8.4
ప్రొద్దుటూరు	16.2	ఒంటిమిట్ట	8.2
చెన్నూరు	15.6	లింగాల	7.8
ఎర్రగుంట్ల	15.4	ముద్దనూరు	7.2
వల్లూరు	12.4	చక్రాయపేట	6.2
కమలాపురం	11.2	తొండూరు	6.2
గోపవరం	10.4	వేంపల్లి	6.0
జమ్మలమడుగు	10.4	వీఎన్‌పల్లి	5.6
సీకేదిన్నె	10.2	పులివెందుల	4.8

పెన్నా ప్రాంతంలో డ్రోన్‌లతో పర్యవేక్షణ



పెన్నా నదీ వరద ప్రవాహాన్ని.. చుట్టు ఉన్న ప్రాంతాన్ని డ్రోన్ కెమెరాతో తీసిన చిత్రం

ప్రొద్దుటూరు క్రైం : భారీ వర్షాలకు కుందూ, పెన్నా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఒక్కసారిగా నీటి ఉధృతి పెరగడంతో నది పరివాహక ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. కొన్ని రోజుల క్రితం పెన్నా నదిలోకి వెళ్లిన వృద్ధ దంపతులు నీరు పెరగడంతో ఒడ్డుకు రాలేకపోయారు. నీళ్లలో చిక్కుకున్న వారిని రూరల్ పోలీసులు, అగ్నిమాపక రెస్క్యూ టీం సభ్యులు కాపాడారు. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు రూరల్ పోలీసులు నదీ పరివాహక ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం సాయంత్రం రూరల్ సీఐ బాల మద్దిలేటి, ఎస్ఐ కేసీ రాజులు డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ చేశారు. పెన్నా నీటి ప్రవాహ సమీపంలో ఉన్న ప్రజలను సురక్షిత ప్రాంతాలకు వెళ్లేలా సూచనలు చేశారు. నీళ్లలో ఇంకా ఎవరైనా చిక్కుకున్నారా, నీటి ప్రవాహం ఎంత వరకు ఉందనే దానిపై కెమెరాల ద్వారా పరిశీలించారు. పెన్నా నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రామేశ్వరంలోని ఆర్టీపీపీ రహదారిలో రాకపోకలను నిలిపేశారు. ప్రజలు వెళ్లకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. కనీస అవగాహన లేకుండా నీటి ప్రవాహంలో వెళ్లరాదని ప్రజలకు రూరల్ సీఐ బాల మద్దిలేటి సూచించారు.

నేడు ఆకేపాడుకు వైఎస్ జగన్ రాక



కడప కార్పొరేషన్/రాజంపేట : అన్నమయ్య జిల్లా, రాజంపేట మండలం ఆకేపాడుకు ఈనెల 19వ తేదీ వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్నారు. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి సోదరుడి కుమారుడి వివాహ రిసెప్షన్‌లో ఆయన పాల్గొననున్నారు. మంగళవారం ఉదయం 11.30 గంటలకు వైఎస్ జగన్ రాజంపేట మండలం బాలిరెడ్డిగారిపల్లె హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడినుంచి రోడ్డు మార్గాన ఆకేపాడు చేరుకుని, ఆకేపాటి ఎస్టేట్స్‌లో ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి సోదరుడు అనిల్‌కుమార్ రెడ్డి కుమారుడి వివాహ రిసెప్షన్‌లో పాల్గొంటారు. అనంతరం అక్కడి నుంచి తిరుగు పయనమవుతారు.

హెలిప్యాడ్ పరిశీలన

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బెంగళూరు నుంచి ఆకేపాడుకు చేరుకోనున్నారు. ఇందుకోసం హెలీప్యాడ్ సిద్ధం చేశారు. సోమవారం ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి హెలీప్యాడ్‌ను పరిశీలించారు.ఎమ్మెల్యే వెంట స్థానిక వైఎస్సార్‌సీపీనేతలు పాల్గొన్నారు.



హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

దేవునికడప ఆలయ జీర్ణోద్ధరణ పనులు ప్రారంభం

- బాలాలయ నిర్మాణానికి శ్రీకారం
- అంకురార్పణ పూజల నిర్వహణ



బాలాలయ సంప్రోక్షణకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు

కడప సెవెన్‌రోడ్స్ : దేవుని కడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధరణ పనుల ప్రక్రియ సోమవారం సాయంత్రం ప్రారంభమైంది. బాలాలయ సంప్రోక్షణకు శాస్త్రోక్తంగా అంకురార్పణ, బాల బింబాలకు జలాధివాసం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. టీటీడీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ అధికారి ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ పి.ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షించారు. మూడు రోజులపాటు ఈ కార్యక్రమాలు నిర్వహించి బుధవారం బాలాలయాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకు వస్తారు. తిరుమల-తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవారు, అండాళమ్మ వారి గర్భాలయాన్ని, విమాన గోపురాన్ని, రాజ గోపురాలకు మరమ్మతులు చేపడుతున్నారు. దీంతో స్వామి, అమ్మవార్ల మూల విరాట్‌కు బదులుగా గర్భాలయం ఎదురుగా మండపంలో బాలాలయం నిర్మాణం చేపట్టారు. జీర్ణోద్ధరణ పనులు పూర్తయ్యే వరకు భక్తులు బాలాలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకోవాల్సి ఉంటుంది. స్వామి, అమ్మవార్లకు నిర్వహించే నిత్య, నైమిత్తిక, కామ్య కైంకర్యాలు యథావిధిగా బాలాలయంలో నిర్వహిస్తారు.

- రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాల్లో దేవుని కడప ఆలయం ఒకటి. తిరుమల తొలిగడపగా పేరున్న ఈ ఆలయంలోని స్వామిని జనమే జయ మహారాజు ప్రతిష్ఠించారని చెబుతారు. కైఫీయత్తుల ప్రకారం తిరుపతిలోని గోవిందరాజుల స్వామి ఆలయ రాజగోపురం, దేవుని కడప ఆలయ రాజగోపురం ఒకేసారి నిర్మించినట్లు తెలుస్తోంది. ఇక్కడి ఆలయంలోని రాజగోపురంతోపాటు ముఖ మండపం, గర్భాలయం, అంతరాళం, ప్రాకారం, మట్లి అనంత భూపాలుడు నిర్మించినట్లు తెలుస్తోంది. వైదుంబులు, ఓరిగంటి రాజులు, వల్లూరు పాలకులు, సంబెటరాజులు, సాళువ, సంగమ, తులువ వంశీకులు ఈ క్షేత్రం అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. శ్రీకృష్ణ దేవరాయలు పలుమార్లు కడప రాయుడిని దర్శించినట్లు చరిత్ర చెబుతోంది. పురాతన ఆలయం కావడంతో టీటీడీ జీర్ణోద్ధరణ పనులకు శ్రీకారం చుట్టింది.

నిషేధిత జాబితాలో సమరయోధుడి భూమి

- రికార్డుల్లో సవరించినా ఎన్‌ఓసీ ఇవ్వని దేవదాయ శాఖ అధికారులు
- మామూళ్ల కోసం ఏళ్ల తరబడి తిప్పుకుంటున్న వైనం



ఆలూరు పక్కీరప్ప, దస్తగిరమ్మ దంపతులు(ఫైల్)

కడప సెవెన్‌రోడ్స్ : స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల వల్లే నేడు మనం స్వేచ్ఛగా జీవిస్తున్నాం. అలాంటి సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ వారిని గౌరవించాల్సిన బాధ్యత నేటి తరంపై ఉంది. కొంతమంది అధికారులు గౌరవించడం అటుంచి వారి కుటుంబ సభ్యులను వేధిస్తోంది. జిల్లాకు చెందిన ఓ సమరయోధునికి ప్రభుత్వం ఇచ్చిన భూమికి ఎన్‌ఓసీ జారీ చేయకుండా మామూళ్ల కోసం ఆయన కుటుంబ సభ్యులను ఏళ్ల తరబడి తిప్పుకుంటున్న వైనం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే...

ఎర్రగుంట్ల మండలం చిలమకూరు గ్రామానికి చెందిన ఆలూరు పక్కీరప్ప మహాత్మాగాంధీ పిలుపు మేరకు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. 1921లో మహాత్మాగాంధీ జిల్లాను సందర్శించిన సందర్భంలో పక్కీరప్ప కూడా శాంతియాత్రలో పాల్గొన్నారు. 1941లో జరిగిన వ్యక్తి సత్యాగ్రహం, 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నారు. అజ్ఞాతంతో ఉంటూ కార్యకలాపాలు నిర్వహించారు. మోతుబరి కుటుంబానికి చెందిన తన నివాసంలో సాటి స్వాతంత్ర్య సమరయోధులకు ఆశ్రయం కల్పించడంతోపాటు ప్రజల్లో దేశ భక్తిని పెంపొందించేందుకు ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత ప్రభుత్వం 1951లో చాపాడు మండలం కుచ్చుపాప గ్రామం సర్వే నెంబరు 20/1లో 2.54 ఎకరాలు, 20/2లో 2.50 ఎకరాలు కలిపి మొత్తం 5 ఎకరాల 4 సెంట్ల వ్యవసాయ భూమిని పక్కీరప్పకు పట్టాగా ఇచ్చింది. 1999 నవంబరు 5వ తేదీ పక్కీరప్ప మరణించారు. ప్రభుత్వం ఇచ్చిన భూమిని ఆయన భార్య దస్తగిరమ్మ పేరిట బదలాయించిన రెవెన్యూ అధికారులు.. ఆ భూమి దేవదాయశాఖకు చెందినదిగా పేర్కొంటూ నిషేధిత జాబితాలో చేర్చారు. మైదుకూరు సబ్ రిజిస్ట్రార్ ద్వారా 2011లో ఈ విషయం తెలుసుకున్న పక్కీరప్ప కుటుంబ సభ్యులు అవాక్కయ్యారు. అప్పటి చాపాడు తహసీల్దార్‌ను సంప్రదించారు. పొరపాటున ఆ భూమిని నిషేధిత జాబితాలో ఉంచారని తహసీల్దార్ తెలిపారు. సదరు సర్వే నెంబర్లలోని భూమిని దేవదాయశాఖ నుంచి తొలగిస్తూ జారీచేసిన ఉత్తర్వుల నకలు పక్కీరప్ప కుటుంబ సభ్యులకు ఇచ్చారు. దీంతో నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) ఇవ్వాలంటూ 2021 ఫిబ్రవరి 4వ తేదీ పక్కీరప్ప భార్య దస్తగిరమ్మ కడప దేవదాయ ధర్మదాయశాఖ సహాయ కమిషనర్‌ను కోరింది. ఈ విషయాన్ని పరిశీలించిన సహాయ కమిషనర్ సదరు సర్వే నెంబర్లలోని భూమికి ఎన్‌ఓసీ జారీ చేయాల్సిందిగా కోరుతూ విజయవాడలోని కమిషనర్‌కు నివేదిక పంపారు. ఇదిలాఉండగా 2021 ఫిబ్రవరి 25న పక్కీరప్ప భార్య దస్తగిరమ్మ మరణించారు. పక్కీరప్ప కుమారులు ఆలూరి శరత్‌బాబు, అజయ్‌బాబు ఈ విషయంపై మైదుకూరు సబ్ రిజిస్ట్రార్‌ను సంప్రదించగా, తమకు ఇంతవరకు ఎన్‌ఓసీ రాలేదని బదులిచ్చారు. దీంతో కథ మళ్లీ మొదటికి రావడంతో 2025 జులై 4వ తేదీ దేవదాయశాఖ సహాయ కమిషనర్‌ను సంప్రదించి ఎన్‌ఓసీ జారీ చేయాలంటూ శరత్‌బాబు, అజయ్‌బాబు కోరారు. సహాయ కమిషనర్ ఈ భూమిపై మళ్లీ నివేదిక పంపాలంటూ ఈఓ టెంపుల్స్-2 ప్రొద్దుటూరు ఇన్‌స్పెక్టర్‌ను కోరారు. కేవలం మామూళ్ల కోసం ఉద్దేశపూర్వకంగానే దేవదాయశాఖ అధికారులు జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. తమ సమస్యను యేటా జరిగే స్వాతంత్ర్య దినోత్సవంలో మంత్రుల దృష్టికి తీసుకు వెళుతున్నా పరిష్కారం లభించలేదని బాధితులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎన్‌ఓసీ జారీ చేయడం ద్వారా సమరయోధుని కుటుంబానికి న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు.

అయ్యోర్లపై పని భారం!

- పరీక్షల సంస్కరణల పేరుతో పిల్లలకు మూల్యాంకన పుస్తకాలు
- ఈ ఏడాది నుంచి అమల్లోకి తెచ్చిన విద్యాశాఖ
- బడుల్లోనే మూల్యాంకనం చేయాల్సి రావడంతో బోధనకు అడ్డంకులు
- వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు



మూల్యాంకన పుస్తకంలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు



11,27,796
ఉమ్మడిజిల్లాకు మంజూరైన అసెస్‌మెంట్ బుక్స్

మూల్యాంకన పుస్తకం

కడప ఎడ్యుకేషన్ : కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యాశాఖ తీరు అధ్వానంగా మారింది. అడ్డగోలు, అసంబద్ధ నిర్ణయాలు అమలు చేస్తుండడంతో విద్యా ప్రమాణాలు రోజురోజుకు తీసికట్టుగా మారుతున్నాయి. తాజాగా ప్రస్తుతం నిర్వహిస్తున్న అసెస్‌మెంట్ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల్లో కాకుండా అసెస్‌మెంట్ పుస్తకాల పేరుతో ఉపాధ్యాయులకు అందచేస్తున్నారు. ఈ కొత్త పరీక్షల విధానం ఉపాధ్యాయులకు భారంగా మారడంతోపాటు సర్కారు బడుల్లో విద్యా ప్రమాణాలు మరింత దిగజారుస్తోంది. ఇప్పటికే బోధనేతర పనులతో సతమతమవుతున్న అయ్యవార్లకు ఇదో అదనపు భారంగా మారంది. దీంతో విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఫార్మెటివ్ అసెస్‌మెంట్(ఎఫ్‌ఏ-1) పరీక్షల్లో అమల్లోకి తెచ్చిన అసెస్‌మెంట్ బుక్ ఉపాధ్యాయ లోకానికి గందరగోళానికి గురి చేస్తోంది. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 11,29,796 అసెస్‌మెంట్ పుస్తకాలను ఉపాధ్యాయులకు అందజేయనుంది.

పాఠశాలకు చేరిన అసెస్‌మెంట్ బుక్స్...

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నిర్వహించే పరీక్షలకు సంబంధించి అసెస్‌మెంట్ పుస్తకాలను విద్యాశాఖ ద్వారా పాఠశాలకు పంపించారు. సర్కారు బడుల్లో నిర్వహించే త్రైమాసిక, అర్ధవార్షిక, వార్షిక పరీక్షలను ఎఫ్‌ఏ-1,2,3,4లుగా, ఎస్‌ఏ-1,2లుగా నిర్ణయించారు. ఈ పరీక్షలను విద్యార్థులు మూల్యాంకన పుస్తకాలలో రాసేందుకు వీలుగా 1,2వ తరగతులకు మూడు పుస్తకాలు, 3,4,5 తరగతులకు నాలుగు , 6,7 తరగతులకు ఆరు, 8,9,10 తరగతులకు ఏడు చొప్పున 11,29,796 పుస్తకాలను అందచేయనున్నారు.

ఉపాధ్యాయుల నుంచి తీవ్ర వ్యతిరేకత

ఈ ఏడాదిలో జరిగే అన్ని పరీక్షల వివరాలను ఈ మూల్యాంకన పుస్తకంలో నమోదు చేసేందుకు ఏడాదంతా ఈ పుస్తకాన్ని ఉపాధ్యాయులు భద్రంగా ఉంచాలి. గతంలో తెల్ల కాగితాలపై పరీక్షలు రాస్తే ఉపాధ్యాయులు ఇంటికి తీసుకెళ్లి మూల్యాంకనం చేసేవారు. మార్కులు నమోదుతో పని పూర్తి అయ్యేది. ఇప్పుడు మూల్యాంకనం పుస్తకాలను ఇంటికి తీసుకెళ్లే అవకాశం లేదు, వీటిని భద్రపరచడం తలకుమించిన భారమని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. ఏకపక్షంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వల్ల విద్యా వ్యవస్థ గాడితప్పుతోందని విమర్శిస్తున్నాయి. ఫార్మెటివ్, సమ్మెటివ్ ఆసెస్‌మెంట్ పరీక్షలను ఆ పుస్తకాల్లోనే విద్యార్థులు రాయాలి. పరీక్షలు రాసిన తర్వాత వాటిని దిద్ది అందులోనే ఉన్న ఓఎమ్మార్ సీట్‌లో మార్కులు చేయడంతోపాటు ఓఎమ్మార్ షీట్‌ను విద్యాశాఖ ఇచ్చిన యాప్‌లో ఉపాధ్యాయులు అప్‌లోడ్ చేయాలి. దీనిపై ఉపాధ్యాయలు, సంఘ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


ఉపాధ్యాయులను బోధనకు దూరం చేసేందుకే..



విద్యారంగంలో ప్రభుత్వం ప్రవేశపెడుతున్న రోజుకో సరికొత్త విధానం ఉపాధ్యాయులను బోధనకు దూరం చేయడమే. విద్యార్థులకు పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేకంగా మూల్యాంకన పుస్తకం రూపొందించడం హంగు ఆర్భాటలకే తప్ప ప్రత్యేకంగా ఒనగూరేదేమి లేదు. బోధనకంటే మూల్యాంకన పుస్తకం దిద్దటానికి, దానిని స్కాన్ చేయడానికి, ఇతర విషయాలు రాయటానికే సమయమంతా సరిపోతుంది. పాత విధానమే మెరుగ్గా ఉంది.

– మాదన విజయ కుమార్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

పని ఒత్తిడి పెంచడమే...



ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా తీసుకువచ్చిన మూల్యాంకన పుస్తక విధానంతో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఇప్పటికే బోధనేతర పనులతో సతమతమవుతున్న ఉపాధ్యాయులపై మూల్యాంకన పుస్తకాలు ఇచ్చి అదనపు భారం మోపడం పద్ధతి కాదు, ప్రయోగాలు ఎందుకు చేస్తున్నారో అర్థం కావడం లేదు. ప్రభుత్వం పునరాలోచన చేసి ఈ విధానాన్ని రద్దు చేయాలి.

– సంగమేశ్వరరెడ్డి, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి.

అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలి



ప్రజల అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్

కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులు సంతృప్తి స్థాయిలో పరిష్కారం ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ శ్రీధర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం సభాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో అందిన పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పనిచేయాలని ఆదేశించారు. అనంతరం అర్జీదారుల నుంచి వారు అర్జీలను స్వీకరించారు.

కొన్ని ఫిర్యాదులు ఇలా..

- విచారణ చేయకుండానే వికలాంగుల పెన్షన్ రద్దు చేశారని, తనకు తిరిగి పెన్షన్ మంజూరు చేయగలరని కడప చెమ్మమియాపేటకు చెందిన ఖలీల్ బాషా అర్జీ అందజేశారు.
- మైదుకూరు మండలం బొండ్లవరం గ్రామానికి చెందిన కె.నాగ మునయ్య తన భూమిలో ఫోర్జరీ పత్రాలతో ఇచ్చిన విద్యుత్ కనెక్షన్ తొలగించాలని విన్నవించారు.
- జమ్మలమడుగు బొమ్మేపల్లి గ్రామానికి చెందిన ఎం రెడ్డప్ప నాయక్ తనకు తల్లికి వందనం పథకం మంజూరు చేయగలరని కోరారు.
- తొండూరు మండలం మల్లెల గ్రామానికి చెందిన బి చంద్రశేఖర్ రెడ్డి గ్రామంలోని 4వ రేషన్ షాప్‌ను రద్దు చేసే మూడవ షాపుకు ఇవ్వాలని కోరారు.

సమర్థవంతంగా 'ఆకాంక్షిత జిల్లా' కార్యక్రమాలు

దేశంలోని వెనుకబడిన జిల్లాలను అభివృద్ధి చేయడం ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ ముఖ్య ఉద్దేశ్యమని, జిల్లాలో ఈ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ శ్రీధర్ ఆదేశించారు. సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో జిల్లాలో ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ విభాగాలలో దేశ వ్యాప్తంగా వైఎస్సార్ కడప జిల్లా ర్యాంకు 63గా ఉందని, ఏపీలో ఆస్పిరేషనల్ జిల్లాలైన వైఎస్సార్ కడప, పార్వతి పురం, అల్లూరి సీతారామరాజు జిల్లాలలో మన జిల్లా 73.6 స్కోర్ తో మొదటి స్థానంలో ఉందని తెలిపారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో 35వ ర్యాంక్, విద్యలో 100, వ్యవసాయంలో 24, ఆర్థికాభివృద్ధిలో 71,మౌలిక సదుపాయాలలో 34వ ర్యాంక్ లో ఉన్నామని తెలిపారు. నీతి ఆయోగ్ వారు ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్‌లో కనబరిచిన ఇండికేటర్స్ ఆధారంగా ఆయా శాఖల అధికారులు ఈ అంశం పై అవగాహన పెంచుకొని సరైన వివరాలను అందివ్వాలని ఆదేశించారు.

క్లుప్తంగా

లారీ ఢీ కొని యువకుడి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎల్లనూరు సునీల్‌కుమార్

చాపాడు : మైదుకూరు–ప్రొద్దుటూరు జాతీయ రహదారిలోని కేతవరం గ్రామ సమీపంలో సోమవారం లారీ ఢీ కొని మండలంలోని కేతవరం గ్రామానికి చెందిన ఎల్లనూరు సునీల్‌కుమార్(31)అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఎల్లనూరు ఓబయ్య, వీరమ్మ దంపతుల కుమారుడు సునీల్ కుమార్ ఉదయం 10గంటల సమయంలో కేఏ01ఏవీ 8756 నెంబరు గల బైక్‌లో మైదుకూరుకు వెళుతుండగా ప్రొద్దుటూరు వైపు నుంచి వస్తున్న టీఎల్ 88జే 2621 నెంబరు గల లారీ బైక్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో సునీల్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై చాపాడు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఐదుగురు బైక్ దొంగల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, పోలీసులు

జమ్మలమడుగు : బైకుల చోరీకి పాల్పడుతున్న ఐదుగురు యువకులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం స్థానిక అర్బన్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గత నెల 10వతేదీన ప్రొద్దుటూరు రహదారిలో హోండా యాక్టివా చోరీకి గురైందంటూ బాధితుడు కొక్కొకోల రామమోహన్ ఫిర్యాదు చేశాడన్నారు. ఈ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టగా సోమవారం తమకు దొంగల సమాచారం అందిందన్నారు. ప్రొద్దుటూరు రోడ్డులోని ఎస్ఆర్ పెట్రోల్‌బంకు వద్ద సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా ఐదుగురు యువకులు తమ సిబ్బందిని చూసి వాహనాలు వెనక్కి తిప్పుకుని వెళుతుండటంతో సిబ్బంది పట్టుకున్నారన్నారు. వారిని విచారించగా బైకుల దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారని తెలిపారు. వారి వద్ద నుంచి పది లక్షల రూపాయల విలువ గల 9 బైకులు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. ఈ సమావేశంలో సీఐ లింగప్ప, ఎస్ఐ హైమావతి, దేవదాసు, రియాజ్, నాగేంద్ర, శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పేదలకు పంచాలి



ఆందోళనలో మాట్లాడుతున్న ఓబయ్య

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను గుర్తించి అర్హులైన గ్రామీణ పేదలకు ఒక్కో కుటుంబానికి మూడు ఎకరాలు వ్యవసాయ భూమిగా పంపిణీ చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఓబయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర పిలుపులో భాగంగా సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఐదు వేల ఎకరాల భూమి కబ్జాకు గురైందని పేర్కొన్నారు. సర్వే నిర్వహించి ప్రభుత్వ భూమిని కాపాడి అర్హులకు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జకరయ్య, రమణ, సీఆర్‌వీ ప్రసాద్, డబ్ల్యు రాము, ఆంజనేయులు, గంగయ్య, రామాంజనేయులు, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసీ పరిధిలో సాగని పనులు

- కేసీ కింద ఇప్పుడిప్పుడే నారు మడుల సాగులో రైతన్నలు
- ప్రాజెక్టులు, నదీ పరివాహక ప్రాంతాల్లో సాగు అంతంతమాత్రమే
- 30,804 హెక్టార్ల సాధారణ సాగుకు 6568.27 హెక్టార్లలో వరిసాగు
- 21.32 శాతం మేర సాగైన వరి పంట
- నారుమడులు, వరిసాగు పనుల్లో రైతులు



వరినాటుకు ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతులు

కేసీ కెనాల్ కింద సాగు ఆయకట్టు వివరాలు ఇలా..	
మండలం	ఆయకట్టు (ఎకరాల్లో)
దువ్వూరు	10,419.28
చాపాడు	20,894.48
మైదుకూరు	3,553.23
ఖాజీపేట	20,804.82
రాజుపాలెం	6,894.24
ప్రొద్దుటూరు	5,427.50
కడప	5,371.83
చెన్నూరు	8,200.34
వల్లూరు	406.88
సీకే దిన్నె	121.12
పెద్దముడియం	9,063.0
చాగలమర్రి	643.29
మొత్తం	92,937.01

కడప అగ్రికల్చర్ : కేసీ కాలువ పరిధిలో చాలా మంది రైతులు వరి పంటనే ఎక్కువగా సాగు చేస్తారు. జిల్లా వ్యాప్తంగా కేసీ కాలువ పరిధిలో 92 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉంది. కానీ కేసీ కాలువకు నీరు వచ్చినా వరిసాగు పనులు అంతగా ఊపు అందుకోలేదు. ఇప్పుడిప్పుడే కేసీ కాలువ కింద రైతులు నారుమడులు సాగు చేసే పనుల్లో బిజీగా ఉన్నారు. బోరుబావుల కింద ముందుగా నారుమడులు సాగు చేసుకున్న రైతులు మాత్రం వరినాట్లు చేపట్టగా మిగతా రైతులు ఎవరు కూడా వరినాట్లను అంతగా చేపట్టలేదు. నదీ పరివాహక, ప్రాజెక్టుల పరిధిలో కూడా వరి నాట్ల సాగు అంతగా ముమ్మరం కాలేదు. జిల్లా వ్యాప్తంగా వరి సాధారణ సాగు 30804 హెక్టార్లకు ఇప్పటి వరకు 6568.08 హెక్టార్లలో మాత్రమే వరిపంటను సాగు చేశారు. అంటే 21.32 శాతం మేర వరిసాగు అయింది.. దీంతోపాటు ప్రాజెక్టులు, నదీ పరివాహక ప్రాంతాల్లో కూడా వరిసాగు అంతగా ఊపందుకోలేదు. ఏదిఏమైనా ఈ నెలాఖరుతో పాటు సెప్టెంబర్ మొదటి, రెండో వారంలో వరి సాగు పనులు ఊపందుకోనున్నాయి.

జిల్లాలోని ప్రాజెక్టు పరిధిలో నత్తనడకన..

జిల్లాలోని ప్రాజెక్టుల పరిధిలో కూడా వరిసాగు నత్తనడకన సాగుతోంది. ఇందులో భాగంగా కొండాపురం మండలంలో సాధారణసాగు 413 హెక్టార్లకుగాను ఇప్పటి వరకు కేవలం 25 హెక్టార్లలో వరి సాగైంది. అలాగే బి.మఠంలో 1610 హెక్టార్లకు 720 హెక్టార్లలో, కలసపాడులో 1005 హెక్టార్లకు 111 హెక్టార్లలో, పోరుమామిళ్లలో 1152 హెక్టార్లకు 251 హెక్టార్లలో, బి.కోడూరులో 1056 హెక్టార్లకు 70 హెక్టార్లలో, మైలవరంలో 250 హెక్టార్లకు కేవలం ఒక హెక్టారులో మాత్రమే వరిపంట సాగైంది.

నదీ పరివాహక ప్రాంతాల్లో అంతంతగానే ..

జిల్లాలోని నదీ పరివాహక ప్రాంతాలకు సంబంధించి కూడా వరినాట్లు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. ఇందులో భాగంగా రాజుపాలెంలో సాధారణసాగు 759 హెక్టార్లకు కేవలం 30 హెక్టార్లలో వరి పంట సాగైంది. అలాగే ప్రొద్దుటూరులో 1481 హెక్టార్లకు 70 హెక్టార్లు, జమ్మలమడుగులో 1093 హెక్టార్లకు 520 హెక్టార్లలో, కమలాపురంలో 373 హెక్టార్లకు 272.5 హెక్టార్లలో, వల్లూరులో 1047 హెక్టార్లకు 450 హెక్టార్లలో, చెన్నూరులో 1180 హెక్టార్లకు 529 హెక్టార్లలో, వేంపల్లిలో 450 హెక్టార్లకు 332.84 హెక్టార్లలో, చక్రాయపేటలో 1071 హెక్టార్లకు 321హెక్టార్లలో, సిద్దవటంలో 930 హెక్టార్లకు 905 హెక్టార్లలో, ఒంటిమిట్టలో 261 హెక్టార్లకు 147 హెక్టార్లలో వరిపంట సాగైంది.

కేసీ కాలువ కింద అరకొరగానే..

జిల్లాలోని కేసీ కాలువ పరిధిలోని మండలాల్లో కూడా వరినాట్ల సాగు అరకొరగానే సాగుతోంది. దువ్వూరు మండలంలో సాధారణ సాగు 2585 హెక్టార్లు ఉంటే ఇప్పటికి కేవలం 30 హెక్టార్లలో కూడా వరిపంటను సాగు చేయలేదు. అలాగే మైదుకూరు మండలంలో కూడా 1192 హెక్టార్లకు గాను 8 హెక్టార్లలో వరిపంట సాగైంది. అలాగే ఖాజీపేట మండలంలో 3220 హెక్టార్లకు 20 హెక్టార్లలో, రాజుపాలెంలో 759 హెక్టార్లకుగాను 30 హెక్టార్లలో వరిపంట సాగైంది. అయితే ఇటీవలే చాలా మంది రైతులు నారుమడులను సాగు చేశారు. ఆగస్టు చివరిలో అలాగే సెప్టెంబర్ మొదటి, రెండో వారాల్లో కేసీ కాలువ పరిధిలో వరినాట్ల సాగు ముమ్మరం కానుంది.

నారుమడి సాగు చేశాను..



ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు శ్రీశైలం డ్యాం నిండింది. దీంతో కేసీ కాలువకు రెండు వారాల క్రితమే నీటిని వదిలారు. దీంతో కేసీ కింద రైతులంతా నారుమడులను సాగు చేసే పనిలో బిజీగా ఉన్నారు. నేను కూడా వారం క్రితం నాడు మడిని చల్లాను. మరో రెండు, మూడు వారాల్లో వరిసాగును ప్రారంభిస్తా.

– చిరంజీవిరెడ్డి, రైతు, బి. కొత్తపల్లి, ఖాజీపేట మండలం

లక్ష్యానికి మించి సాగయ్యే అవకాశం..



ఏడాది వరిపంట లక్ష్యానికి మంచి సాగయ్యే అవకాశం ఉంది. ఇటీవల వర్షాభావ పరిస్థితుల్లో వరిసాగు తగ్గుతుందేమో అనుకున్నాం. కానీ ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు శ్రీశైలం డ్యాం నిండింది. దీంతో కేసీ కాలువకు ఇటీవలే నీరు విడుదల చేశారు. ఇక కేసీ పరిధిలోని రైతులందరూ ముమ్మరంగా వరిమడులను సాగు చేసుకుంటున్నారు. మరో పదిహేను రోజుల్లో వరినాట్ల సాగు ముమ్మరం కానుంది. ఈ ఏడాది లక్ష్యానికి మించి సాగయ్యే అవకాశం ఉంది.

– చంద్రానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి

కడప కేంద్ర కారాగారంలో విచారణ

కడప అర్బన్: కడప కేంద్ర కారాగారంలో గతంలో జరిగిన వైద్య శిబిరం, ఇతర అంశాలపై సమగ్రంగా విచారణ జరపాలని ఇటీవల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు, కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్, జైళ్ల శాఖ విజయవాడ కారాగారం సూపరింటెండెంట్ ఇర్ఫాన్, కడప రెవెన్యూ డివిజనల్ అధికారి జాన్ ఇర్విన్‌ను సభ్యులుగా చేర్చి కమిటీ నియమించారు. ఇందులో భాగంగా గతంలో కడప కేంద్ర కారాగారంలో వైద్యుడిగా పనిచేసిన డాక్టర్ ప్రవీణ్‌ను డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి పిలిపించి పలు అంశాలపై విచారించారు. మంగళవారం డాక్టర్ పుష్పలత, తర్వాత బాధ్యులైన కొందరిని పిలిపించి విచారించనున్నారు. అలాగే పోలీస్ శాఖ, జైళ్ల శాఖ, రెవిన్యూ శాఖల నుంచి కమిటీలో నియమితులైన అధికారులు ఆయా శాఖల వారిని విచారించనున్నారు.

రెండు ట్రాన్స్‌ఫార్మర్లలో తీగలు చోరీ

ముద్దనూరు : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొట్టి అందులోని కాపర్‌తీగలను ఆదివారం రాత్రి చోరీ చేశారు. మండలంలోని శెట్టివారిపల్లె గ్రామ సమీపంలోని గ్రామ సచివాలయానికి చెందిన ట్రాన్స్‌ఫార్మర్, అదే గ్రామంలోని ఓ ప్రైవేట్ సెల్ టవర్‌కు చెందిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులోని తీగలను చోరీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి

మదనపల్లె రూరల్ : మదనపల్లె మండలం బసినికొండకు చెందిన షేక్ చాంద్‌బాషా(65) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఓ యజమాని పొలంలో పొలం దున్ని వస్తుండగా, ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడింది. ట్రాక్టర్‌లో నుంచి రోడ్డుపక్కనే ఉన్న కుంటలో పడిన చాంద్‌బాషా మృతిచెందాడు.

విద్యుదాఘాతంతో యువ కౌలు రైతు మృతి



పవన్ కుమార్ (ఫైల్)

మైదుకూరు : సొంత పొలానికి తోడు మరికొంత కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసి కుటుంబాన్ని అభివృద్ధి చేసుకోవాలనుకున్న ఆ యువ రైతు కలలను విద్యుత్ రూపంలో వచ్చిన మృత్యువు కల్లలు చేసింది. వ్యవసాయాన్ని నమ్ముకుని జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలనుకున్న అతన్ని చిన్న వయసులోనే మృత్యువు కబళించింది. మైదుకూరులో సోమవారం పొలం వద్ద మోటారు వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై రాటాల పవన్‌కుమార్ (38) అనే యువ కౌలు రైతు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆళ్లగడ్డ మండలం బాచేపల్లెకు చెందిన రాటాల లక్ష్మీనారాయణకు ముగ్గురు కుమారులు. వారిలో రెండో కుమారుడు పవన్‌కుమార్‌కు 11 ఏళ్ల కిందట మైదుకూరుకు చెందిన లక్ష్మీదేవితో వివాహమైంది. బాచేపల్లెలో సొంత పొలం ఒక ఎకరాకు తోడు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని పవన్‌కుమార్ పంటలు సాగు చేస్తున్నాడు. మూడేళ్ల కిందట మైదుకూరుకు నివాసాన్ని మార్చి ఇక్కడ కొందరి రైతుల పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. స్థానిక ఎర్ర చెరువు ప్రాంతంలో కౌలుకు తీసుకున్న పది ఎకరాల పొలంలో వరి నాటాల్సి ఉంది. సోమవారం పొలాన్ని వరి నాటేందుకు సిద్ధం చేయడానికి బాడుగ ట్రాక్టర్‌ను పిలుచుకొని వెళ్లాడు. పొలానికి తగినంత నీరు పెట్టేందుకు ఉదయం 11 గంటల ప్రాంతంలో మోటారు ఆన్ చేశాడు. విద్యుత్ ఘాతానికి గురై విలవిల్లాడుతూ పవన్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అదే సమయంలో భర్తకు భోజనం తీసుకుని పొలం వద్దకు వెళ్లిన భార్య లక్ష్మీదేవి ఆ దృశ్యాన్ని చూసి కుప్పకూలిపోయింది. భర్త మృతదేహం వద్ద కన్నీరు మున్నీరైంది. మృతి చెందిన కౌలు రైతు పవన్‌కుమార్‌కు ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. సంఘటన స్థలాన్ని మైదుకూరు అర్బన్ పోలీసులు పరిశీలించి పవన్ కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని బంధువులు కోరారు.

ప్రజా ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత

జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్

కడప అర్బన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో స్వీకరించే ఫిర్యాదులు పునరావృతం కాకుండా ఆయా ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి శాశ్వత పరిష్కారం చూపాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం' నిర్వహించారు. జిల్లా నలు మూలల నుంచి వచ్చిన 149 మంది ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా ఫిర్యాదుల గురించి సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడి త్వరితగతిన చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం అందించేలా చూడాలన్నారు. ఫిర్యాదులపై తీసుకున్న పరిష్కార చర్యలు, పూర్తి వివరాలను నివేదిక రూపంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి అందజేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, మహిళా పీఎస్ డీఎస్పీ బాలస్వామిరెడ్డి, పాల్గొన్నారు.

సెంట్రల్ జైలులో అవినీతి కిరణం!

- పెట్రోల్ బంక్‌లో రూ.7లక్షలు విలువైన ఆయిల్ స్వాహా
- కాంపౌండ్ వాల్ నిర్మాణంలో నిబంధనలు పాటించని వైనం
- ఇష్టారాజ్యంగా ప్రవర్తించిన ఓ ఉన్నతాధికారి
- దొంగ చేతికి తాళమిచ్చినట్లుగా అదనపు బాధ్యతలు



సాక్షి ప్రతినిధి, కడప : సత్‌ప్రవర్తన నేర్పించాల్సిన సిబ్బంది స్వయంగా ఖైదీలకు తప్పుడు నడతను అలవాటు చేస్తున్నారు. డబ్బులు ఇస్తే ఎంజాయ్ చేసేందుకు కావాల్సిన సదుపాయాలు సమకూరుస్తున్నారు. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా? అన్నట్లుగా అవినీతి 'కిరణం' అండ చూసుకుని సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పెట్రోల్ బంకులో చోటుచేసుకున్న అవినీతి విషయంలో ఇప్పటికీ చర్యల్లేవు. వెరసి కడప సెంట్రల్ జైలులో తప్పు మీద తప్పులు దొర్లుతున్నాయి.

కడప కేంద్ర కారాగారం తరచూ వార్తల్లోకి ఎక్కుతోంది. ఖైదీలకు కావాల్సిన సదుపాయాలు కల్పించడంలో ఓ ఉన్నతాధికారిది అందెవేసిన చేయిగా చెప్పుకొస్తున్నారు. గతంలో కొందరు ఖైదీలకు ఏకంగా 600 రోజులు ఉపశమనం కలిపించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయమై లోకాయుక్తకు ఫిర్యాదులు వెళ్లినా నిష్ప్రయోజనమే అయింది. ఉన్నతాధికారి భయాందోళనలకు గురి చేయడంతో సిబ్బంది మౌనం దాల్చారు. ఖైదీలచే నిర్వహిస్తున్న పెట్రోల్ పంపులో సుమారు రూ.7లక్షలు అవినీతికి ఆస్కారమిచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఓ డిప్యూటీ జైలర్‌ను బాధ్యుడిని చేస్తూ నివేదికలు ఇచ్చారు. ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు లేవు. అలాగే కేంద్ర కారాగారం చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించేందుకు రూ.3.15 కోట్లు ప్రిజనర్స్ డెవలప్‌మెంట్ నిధి ద్వారా మంజూరు చేశారు. అందులో మెటీరియల్ కొనుగోలు కమిటీతో సంబంధం లేకుండా రూ.1. 3 కోట్లు ఏకంగా హెడ్ ఆఫీసును తప్పుదారి పట్టించి ప్రొసీజర్స్‌ను ఉల్లంఘించారు. ఇలాంటివి తరచూ చోటుచేసుకుంటుండడంతో సిబ్బంది సైతం పెడదారి పట్టినట్లు సమాచారం.

సీఎంకు ఫిర్యాదుల పరంపర..

కడప సెంట్రల్ జైలు ఉన్నతాధికారి ఒకరు ఇష్టానుసారంగా వ్యవహరించారని ప్రొసీజర్స్ ఉల్లంఘించారని, సివిల్ వర్క్సులో అవినీతికి పాల్పడ్డారని అనేక ఫిర్యాదులు చేస్తూ సీఎం చంద్రబాబునాయుడు, హోంమంత్రి, ప్రిన్సిపల్ సెక్రెటరీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ఇదివరకూ పర్యవేక్షణాధికారిగా పనిచేసి అవినీతికి పాల్పడిన వ్యక్తికే అదనపు బాధ్యతలు కూడా కట్టబెట్టారని చర్యలు తీసుకోవాల్సిందిగా పలువురు ఫిర్యాదుల పరంపరను కొనసాగిస్తున్నట్లు సమాచారం.

అదృశ్యమైన మహిళ దారుణ హత్య

చిన్నమండెం : మదనపల్లె మండలంలో అదృశ్యమైన ఓ మహిళ అత్యంత దారుణంగా హత్యకు గురైన సంఘటన వెలుగు చేసింది. ఈ నెల 10వ తేదీన మదనపల్లె మండలం పొన్నేటిపాలెం పంచాయతీ సవరంవారిపల్లెకు చెందిన శ్రీదేవి(45) అనే మహిళ అదృశ్యమైనట్లు ఆమె బావ వాసు మదనపల్లె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు ఆమె అదృశ్యం కేసును ఛేదించినట్లు రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, చిన్నమండెం ఎస్ఐ సుధాకర్ తెలిపారు. శ్రీదేవితో వివాహేతర సంబంధం ఉన్న ఆమె అక్క అల్లుడైన శివకుమార్ నాయుడు తన మోటార్ సైకిల్‌లో ఆమెను ఎక్కించుకుని చిన్నమండెం పరిధిలోని అడవిలో గొంతుకు ఉరివేసి చంపివేశాడన్నారు.

పాఠశాల విలీనాన్ని ఆపాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కడప సెవెన్‌రోడ్స్ : చాపాడు మండలం చియ్యపాడు గ్రామ ఎస్సీ కాలనీలో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న పాఠశాలను మోడల్ స్కూలు పేరుతో వేరే చోటికి తరలించడం తగదని, తక్షణమే దీనిని ఆపాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన నిర్వహించారు. సుమారు ఒకటిన్నర కిలోమీటరు దూరంలో ఉన్న మోడల్ స్కూలులో తమ పాఠశాలను విలీనం చేస్తే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. మోడల్ స్కూలుకు వెళ్లే దారిలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. కనుక తమ పాఠశాలను తమ కాలనీలోనే ఉంచాలన్నారు. ఇందుకు కారణమైన ఎంఈఓను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బీఎస్ కర్ణమాదిగ, తప్పెట హరిబాబు, పీఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 27 బార్లకు నోటిఫికేషన్ విడుదల



నోటిఫికేషన్ విడుదల చేస్తున్న జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో 27 బార్లకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జయరాజు తెలిపారు. సోమవారం నగరంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కడప కార్పొరేషన్ పరిధిలో–12, ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో–7, బద్వేల్ మున్సిపాలిటీలో–2, మైదుకూరు మున్సిపాలిటీలో–1, పులివెందుల మున్సిపాలిటీలో–2, ఎర్రగుంట్ల నగర పంచాయతీ, కమలాపురం నగర పంచాయతీకి ఒక్కొక్కటి చొప్పున బార్ల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతిలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు రుసుం ఫీజు నాన్ రీఫండబుల్ రూ.5 లక్షలు, ప్రాసెసింగ్ ఫీజు రూ.10 వేలు కలిపి మొత్తం రూ. 5.10 లక్షలు చెల్లించాలన్నారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల లోపల దరఖాస్తు చేసుకోవాలన్నారు. 28న జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో డ్రా తీసి ఎంపిక చేస్తామన్నారు. ఒక బార్ కోసం నాలుగు లేదా అంతకు పైగా దరఖాస్తులు వస్తే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన వారు మొదటి వాయిదాను ఒక రోజులోనే చెల్లించాలన్నారు. బార్ నిర్ణీత గడువు 3 సంవత్సరాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్, సూపరింటెండెంట్ రవికుమార్ పాల్గొన్నారు.

గీత కులాలకు మద్యం బార్ల కేటాయింపు



డిప్ తీసి ప్రకటిస్తున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆధ్వర్యంలో జిల్లాలోని రెండు బార్లను గీత కులాల వారికి లాటరీ పద్ధతిలో కేటాయించారు. సోమవారం కలెక్టరేట్‌లో కడప మునిసిపల్ కార్పొరేషకు సంబంధించి 'గౌడ' ఉపకులాలకు, ప్రొద్దుటూరు మునిసిపాలిటీ 'ఈడిగ' ఉపకులాల వారికి లాటరీ ద్వారా కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ జయరాజు, జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి రవి కుమార్, జిల్లా ఈడిగ సంఘం సెక్రటరీ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

హామీల అమలులో 'సూపర్ ఫెయిల్యూర్'

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : సూపర్ సిక్స్ హామీలు సూపర్ సక్సెస్‌గా అమలు చేశామని ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం 'సూపర్ ఫెయిల్యూర్' అని ఎద్దేవా చేశారు. కొన్ని పత్రికలు, టీవీల్లో సూపర్ సిక్స్ హామీలను సూపర్ సక్సెస్‌గా అమలు చేశానని చెబుతుంటే ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. పిల్లి పాలు తాగుతూ ఎవరూ చూడలేదని అనుకున్న చందంగా అరకొర హామీలు అమలు చేస్తూ అన్నీ చేశామని చెప్పుకోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఈవీఎంల మోసంతోనే ఈ ప్రభుత్వానికి ఎక్కువ సీట్లు వచ్చాయని, అయినా వైఎస్సార్‌సీపీకి 42 శాతం ఓట్లు వచ్చాయన్నారు. రాష్ట్రంలో ప్రజల తరుపున పోరాడే నిజమైన ప్రతిపక్షం వైఎస్సార్‌సీపీ ఒక్కటేనని, తమ పోరాటం వల్లే అరకొర పథకాలైనా అమలు చేశారన్నారు. పింఛన్ మొత్తాన్ని వెయ్యి రూపాయలు పెంచి 5లక్షల పింఛన్లు కోత కోశారని, మరో పది లక్షలు కోత విధించేందుకు సర్వే చేశారని, అర్హులు ఎవరైనా ఉంటే మళ్లీ అప్పీలు చేసుకోవాలని నంగనాచి మాటలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. 60–70 శాతం వైకల్యం ఉన్నవారికి కూడా పింఛన్లు తీసేస్తున్నారని, ఆ పాపం ఊరికే పోదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చారని, ఇంత వరకూ ఒక్క కొత్త పింఛన్ కూడా ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో 82లక్షల మంది విద్యార్థులు ఉంటే 52లక్షల మందికే తల్లికి వందనం అమలు చేశారని, మధ్యాహ్న భోజనం పథకం, విద్యాకానుక, వసతి దీవెన పథకాలను ఎత్తేసి విద్యా వ్యవస్థను సర్వనాశనం చేశారన్నారు. ఈ ప్రభుత్వాన్ని నమ్మి రైతులు దారుణంగా మోసపోయారని, కేంద్ర సాయంతో సంబంధం లేకుండా రూ.20వేలు ఇస్తామని చెప్పి... రూ.7వేలు ఇచ్చి సరిపుచ్చారన్నారు. యూరియా, ఎరువులు, విత్తనాలు లేక రైతులు విలవిల్లాడుతున్నారన్నారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కూడా ఇవ్వడం లేదని, పంట నష్టం సంభవిస్తే నష్ట పరిహారం ఊసే లేదన్నారు. ఎన్నికల ముందు ఉచిత బస్సు ప్రయాణం అని చెప్పి రాష్ట్రంలో ఎక్కడికైనా పోవచ్చని ఊదరగొట్టారని, ఇప్పుడు హైర్ బస్సులు, ఏసీ బస్సులు, డీలక్స్, సూపర్ లగ్జరీ వంటి ఏ బస్సుల్లోనూ ఉచిత ప్రయాణం లేదని షరతులు పెట్టారన్నారు. ఘాట్ ఉన్నా, స్పెషల్ సర్వీసుల్లో కూడా ఉచిత ప్రయాణం లేదన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు ఇస్తామని ఇంతవరకూ ఇవ్వలేదని, దాన్ని పీ4 పథకంలో అంతర్భాగం చేశామని చెబుతున్నారన్నారు. 20లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, దాన్ని స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు అప్పగించారన్నారు. కరెంటు చార్జీలు పెంచబోమని చెప్పి, ఇప్పటికి మూడు సార్లు పెంచారని చెప్పారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కనుమరుగయ్యాయన్నారు. టీడీపీ ఎమ్మెల్యేలు మహిళలను వేధిస్తూ లైంగిక దాడులకు పాల్పడుతున్నారన్నారు. త్వరలోనే ప్రజలు ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు యానాదయ్య, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్. వెంకటేశ్వర్లు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్. శివరామ్, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు షేక్ షఫీ, పార్టీ జిల్లా కార్యదర్శి మునిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.